సాక్షి
వికారాబాద్
శనివారం । 27 । మే । 2023



ఈగల నుంచి కాపాడండి
గ్రామసమీపంలోని పౌల్ట్రీఫాం వల్ల దుర్వాసనతో పాటు ఈగలు, దోమల బెడద ఎక్కువైందని ఐనాపూర్ వాసులు చెబుతున్నారు. 10లో▸



ఘనంగా ఈదమ్మ జాతర
దౌల్తాబాద్‌లో ఈదమ్మ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10లో▸



అందని ద్రాక్షేనా..!
గర్భిణులు, బాలింతలకు విడతల వారీగా ప్రభుత్వం అమలు చేసిన నగదు పంపిణీ పథకం అందని ద్రాక్షగానే మారింది. 11లో▸

న్యూస్‌రీల్

విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను శుక్రవారం డివిజన్ టాస్క్‌ఫోర్స్ టీం ఏడీఏ శంకర్‌రాథోడ్, ఎస్‌ఐ రవిగౌడ్, ఏఓ బాలాజీ ప్రసాద్ తనిఖీ చేశారు. లూజు విత్తనాలు, ప్యాకింగ్ చిరిగిపోయిన, సీల్ లేని విత్తనాలను విక్రయించకూడదని వ్యాపారులను ఆదేశించారు. సరైన లేబుల్ లేని విత్తనాలను కొనుగోలు చేయకూడదని, విధిగా రశీదులు తీసుకోవాలని, పంట పూర్తయ్యే వరకు వీటిని భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జయవర్ధన్, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, బీటీఎం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచుతాం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొడంగల్ రూరల్: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చివరి గింజ పూర్తయ్యే వరకూ కొనుగోలు కేంద్రాలు తెరిచే ఉంటాయని తెలిపారు. మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట కొడంగల్, బొంరాస్‌పేట పీఏసీఎస్ చైర్మన్లు శివకుమార్‌గుప్త, విష్ణువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, డీఎస్‌ఓ రాజేశ్వర్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ భీములు, నాయకులు రామునాయక్, రైతులు పాల్గొన్నారు.

111జీఓ నిజ నిర్ధారణ కమిటీ సభ్యుడిగా టీఆర్ఆర్



రామ్మోహన్‌రెడ్డి

పరిగి: 111 జీఓ ఎత్తివేత.. పీసీసీ అధ్యయన కమిటీ మెంబర్‌గా డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డిని నియమించారు. ఇటీవల ప్రభుత్వం 111 జీఓను ఎత్తివేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై సమగ్ర అధ్యయనం చేసేందుకు పీసీసీ ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీని వేశారు. ఇందులో తనకు అవకాశం కల్పించడంపై టీఆర్ఆర్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు.

గృహ ప్రవేశానికి రండి



మహేందర్‌రెడ్డికి పత్రికను ఇస్తున్న ఎమ్మెల్యే

తాండూరు: పట్టణంలో నిర్మించిన తన నూతన గృహ ప్రవేశానికి రావాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గురువారం రాత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆహ్వానించారు.

జూనియర్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023– 24 విద్యా సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ సురేశ్వర్‌స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూర ప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్: 8919967326, 9441736441, 8985042143, 9959531361 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు తలసాని, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు



దశదిశలా బోన వైభవం

బోనాలు అదిరేలా



- ఉత్సవ నిర్వహణకు రూ.15 కోట్లు
- 26 దేవాలయాలకు ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు
- అంబారీ ఊరేగింపునకు ఏనుగును సమకూర్చనున్న ప్రభుత్వం
- బోనాల ఏర్పాట్లపై మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమీక్ష
- హాజరైన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, సీఎస్, డీజీపీ

సనత్‌నగర్: తెలంగాణ సంస్కృతిని ప్రపంచం నలుదిశలా చాటిచెప్పేలా ఆషాఢ బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. జూన్ 22న ప్రారంభం కానున్న ఆషాఢ బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం బేగంపేటలోని హరితాప్లాజాలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ బోనాల పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించారని, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

ఉత్సవాల నిర్వహణకు రూ.15 కోట్లు

- బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జూన్ 22న గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. జులై 9న సికింద్రాబాద్ మహంకాళి బోనాలు, 10న రంగం, 16న ఓల్డ్ సిటీ బోనాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అనేక ప్రైవేటు దేవాలయాలకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. బోనాల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో వసతులు, ఏర్పాట్ల కోసం సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.
- ఉత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు.
- విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం జీహెచ్ఎంసీ అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమిస్తామన్నారు.
- ఊరేగింపు నిర్వహించే రహదారులు, ఆలయాలకు వెళ్ళే రహదారుల్లో అవసరమైన మరమ్మ తులు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు అధికారులు చర్య లు తీసుకోవాలని ఆదేశించారు.
- శాంతిభద్రతల పర్యవేక్షణకు ఇతర జిల్లాల నుంచి అదనపు పోలీసు సిబ్బంది సేవలను ఉపయోగించుకోవడం జరుగుతుందని, అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయనున్నట్లు వివరించారు. స్వచ్ఛందంగా సేవలు అందించే వాలంటీర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులను అందజేస్తామని తెలిపారు.

బోనాల తేదీలు ఇలా...

- జూన్ 22న గోల్కొండ జగదాంబికాకు తొలిబోనం
- జులై 9న సికింద్రాబాద్ మహంకాళి
- జులై 16న ఓల్డ్ సిటీ బోనాలు..

26 దేవాలయాలకు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు..

నకిలీ అడ్డా!



- నాసిరకం విత్తనాలకు స్థావరంగా మారిన జిల్లా
- కర్ణాటక సరిహద్దులో ఉండటంతో జోరుగా అక్రమ దందా
- ఏటా పెద్దఎత్తున పట్టుబడుతున్న లూజ్ పత్తి విత్తనాలు
- ఈసారి సీరియస్‌గా దృష్టిసారించిన కలెక్టర్, ఎస్పీ

తాండూరు: వికారాబాద్ జిల్లా కర్ణాటక సరిహద్దులో ఉండటంతో నకిలీ విత్తనాల వ్యాపారానికి అడ్డాగా మారింది. కొంతమంది అక్రమార్కులు ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా ఈదందా చేస్తున్నారు. గతేడాది కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్‌కు చెందిన కిరణ్, లక్ష్మీనారాయణ 5.95 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను కారులో వికారాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. వీరి వద్ద నుంచి లూజ్ పత్తి విత్తనాలు, వివిధ బ్రాండెడ్ కంపెనీలకు చెందిన కవర్లు, తూకపు యంత్రాలను సీజ్ చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీ

జిల్లాలో ఈసారి నకిలీ విత్తనాలను అరికట్టడంపై కలెక్టర్, ఎస్పీ సీరియస్‌గా దృష్టిసారించారు. ఈ మేరకు సంబంధిత శాఖలతో సమావేశాలు నిర్వహించి, స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ వ్యాపారులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్కో పోలీస్ సబ్ డివిజన్‌కు ఒక్కో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులను భాగస్వాములను చేశారు. తాండూరు డివిజన్‌లోని కొత్లాపూర్, పరిగిలోని రావల్‌పల్లి, వికారాబాద్‌లోని తొర్మామిడి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి జిల్లాలోకి నకిలీ విత్తనాలు రాకుండా చర్యలు చేపట్టారు. జిల్లాలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

అడ్డదారుల్లో అక్రమ రవాణా

వర్షాకాలం సీజన్ రాగానే కర్ణాటకకు చెందిన అక్రమార్కులు నకిలీ విత్తనాలు తెచ్చి రైతులు, వ్యాపారులకు అంటగడుతున్నారు. గ్రామాల్లోని మోతుబరి రైతులను మచ్చిక చేసుకుని వీటిని విక్రయించాలని, ఇందుకు తగిన ప్రతిఫలం అందజేస్తామని ఒప్పందాలు చేసుకుంటున్నారు. దీంతో వీరి దందా గుట్టుగా సాగుతోంది. బషీరాబాద్, తాండూరు, పెద్దేముల్, బంట్వారం, కొడంగల్, దౌల్తాబాద్ మండలాల్లోని పలు గ్రామాల మీదుగా కర్ణాటక నుంచి జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉంది. కానీ పోలీసులు మాత్రం ప్రధాన రహదారుల వద్దే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. దీంతో అక్రమార్కులు అడ్డదారుల్లో రవాణా సాగిస్తున్నారని తెలుస్తోంది.

నిఘా పెట్టాం

నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోకుండా ఉండేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశాం. కర్ణాటక నుంచి నకిలీ విత్తనాలు రాకుండా సరిహద్దులో కట్టుదిట్టమైన నిఘా పెట్టాం. పట్టుబడిన వారిపై పీడీ యాక్ట్ పెట్టి కఠిన చర్యలు తీసుకుంటాం.

– శేఖర్‌గౌడ్, డీఎస్పీ, తాండూరు

సమాచారం అందించాలి

తాండూరు రూరల్ సర్కిల్ పరిధిలో సరిహద్దు ప్రాంతం విస్తరించి ఉంది. బోర్డర్‌పై నిఘా పెంచాలని ఎస్‌ఐలను ఆదేశించాం. విత్తనాలు విత్తుకొనే సమయం కావడంతో దళారులు వచ్చి నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి వారిపై పోలీసులకు సమాచారం అందించాలి.

– రాంబాబు, సీఐ, తాండూరు రూరల్

11 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు స్వాధీనం

- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్, రిమాండ్
- పట్టుబడిన విత్తనాల విలువ రూ.14 లక్షలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: నకిలీ పత్తి విత్తనాలు విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ కోటిరెడ్డి హెచ్చరించారు. అక్రమ దందాపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని శుక్రవారం వికారాబాద్‌లో అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. వికారాబాద్ టౌన్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో ఎన్నెపల్లి చౌరస్తా వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా బాపట్లకు చెందిన జి.శ్రీనివాస్‌రావు అనే వ్యక్తి రెండు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారన్నారు. అతని చేతిలోని బ్యాగులను తనిఖీ చేయగా.. కేజీ చొప్పున పత్తి విత్తనాలున్న 25 ప్యాకెట్లు లభించాయన్నారు. ఈవిషయమై లోతుగా ఆరా తీయగా.. తాను మంత్రాలయం సమీపంలోని ఎమ్మిగనూర్‌లో గతేడాది సదానంద్ బ్రాండ్‌కు చెందిన హెచ్‌టీ కాటన్ విత్తనాలతో పంట వేశానని శ్రీనివాస్ చెప్పాడు. ప్రస్తుతం తెలంగాణలో హెచ్‌టీ కాటన్ విత్తనాలకి మంచి డిమాండ్ ఉందని తెలుసుకుని.. పండించిన పత్తిని కర్నూల్‌లో జిన్నింగ్ చేయించి సుమారు 10 నుంచి 12 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేవాడని తెలిపారు. వీటికి గులాబీ రంగు, థియామెథోక్సిస్ 30శాతం రసాయనాన్ని కలిసి వికారాబాద్, నారాయణ్‌పేట్ ప్రాంతాల్లోని రైతులకు విక్రయించాలని భావించాడు. ఈ క్రమంలో తెలంగాణ సరిహద్దు గ్రామమైన కర్ణాటకలోని ముధోల్ మండలం వీర్లపల్లిలో రెండు నెలల క్రితం ఒక గదిని అద్దెకు తీసుకుని విత్తనాలను నిల్వ చేశాడు. వీటిని విక్రయించేందుకు శాంపిల్స్ తీసుకుని రైతులను కలిసేందుకు బయల్దేరాడు. ఈ క్రమంలో పోలీసులకు చిక్కాడని ఎస్పీ వివరించారు. శ్రీనివాస్ వద్ద ఉన్న 25 కిలోల పత్తి విత్తనాలను వ్యవసాయాధికారితో పరీక్షలు చేయించగా అవన్నీ నకిలీవిగా నిర్ధారించారని తెలిపారు. వెంటనే టౌన్ సీఐ శీను కర్ణాటకలోని ఈర్లపల్లికి వెళ్లి నిందితుడు దాచిపెట్టిన 9.75 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.

మోమిన్‌పేటలో మరొకరు..

ఇదిలా ఉండగా గత రెండు రోజుల క్రితం మోమిన్‌పేట మండలంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి సుమారు క్వింటాలు పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇతను కూడా ముధోల్ మండలం అడ్కి గ్రామంలో ఓ రూమ్‌ను రెంట్‌కు తీసుకుని వ్యాపారం కొనసాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇరువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. రెండు ఘటనల్లో సీజ్ చేసిన విత్తనాల విలువ రూ.14 లక్షలు ఉంటుందని తెలిపారు. రైతులు జాగ్రత్తగా ఉండాలని, ప్రభుత్వ లైసెన్స్ ఉన్న వ్యాపారులు, డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. రెండు కేసుల్లో చురుగ్గా వ్యవహరించిన పోలీసులను అభినందించారు. సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ, టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశం, సీఐ శ్రీను, ఏడీఏ వినోద్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏఓ జ్యోతి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పరిగిపై కాసాని నజర్

- టీడీపీ జెండాతో పోటీకి సిద్ధమవుతున్న సీనియర్ నేత
- కొడుకును బరిలో దించే యోచనలో జ్ఞానేశ్వర్
- ముదిరాజ్, బీసీ నేతలను ఏకం చేసే దిశగా ఎత్తులు
- 'పొత్తు'ల సమీకరణలో టికెట్ సాధనకు ప్రయత్నాలు



వికారాబాద్: పరిగి నియోజకవర్గంపై టీడీపీ దృష్టి సారించింది. కాసాని జ్ఞానేశ్వర్ ఆ పార్టీ తీర్థం పుచ్చుకుని రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన రోజు నుంచి పరిగిపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా అభిమానులు, వివిధ పార్టీల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. రాష్ట్రంలోనే ముదిరాజ్ సామాజిక వర్గం ఓటర్లు అత్యధికంగా ఉన్న రెండో నియోజకవర్గం పరిగి. ఇదే సామాజిక వర్గానికి చెందిన ఆయన రెండు దశాబ్దాలుగా ఇక్కడ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో కాసానికి మంచి పట్టుంది. 2009లో సొంతంగా పార్టీ పెట్టిన సమయంలోనే ఇక్కడి నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకుని బీసీ నేతలను పెద్ద సంఖ్యలో కూడగట్టారు. ఈసారి గెలుపు ఖాయం అనే వాతావరణం ఏర్పడినా.. చివరి నిమిషంలో విరమించుకున్నారు. ప్రస్తుతం టీడీపీకి పెద్దగా బలం లేనప్పటికీ సొంత ఇమేజ్, ముదిరాజ్, బీసీ కార్డు పట్టుకుని తన కొడుకు కాసాని వీరేశ్‌ను రంగంలోకి దింపేందుకు కసరత్తు చేస్తున్నారు.

కార్యాచరణ మొదలు

ఇప్పటి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న పలువురు నేతలు కాసాని రాకతో ఆయన వైపు మళ్లారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన తర్వాత జ్ఞానేశ్వర్ జిల్లాలో ఎక్కడా చిన్న కార్యక్రమం కూడా చేపట్టలేదు. కానీ వీరేశ్ మాత్రం తరచూ పరిగిలో పర్యటిస్తున్నారు. ఇటీవల పార్టీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా వేల సంఖ్యలో కార్యకర్తలు, జనాలను పరిగికి తరలించి అక్కడే పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలనుంచి అభిమానులు, పార్టీ శ్రేణులు హాజరయ్యాయి. సీఎం సభ తరహాలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర పునర్విభజన తర్వాత మొదటి సారి పరిగిలో పసుపు తోరణాలు, ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి.

పొత్తుతో ఎసరు ఎవరికో..?

తెలంగాణాలో టీడీపీ ఏదో ఒక పార్టీతో పొత్తు పెట్టుకోవటం ఖాయంగా కనిపిస్తోంది. ఇది ఎవరికి ఎసరు పెడుతుందోనని నేతల్లో భయం మొదలైంది. బీజేపీ లేదా కాంగ్రెస్‌తో పొత్తునకు అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా.. టీడీపీ తరఫున పరిగి సీటు తప్పకుండా తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఆయా పార్టీల్లోని ఆశావహులకు గ్రహపాటు తప్పకపోవచ్చు.

అభివృద్ధి పనులు భేష్



తిర్మలాపూర్‌లో సర్పంచ్ కమ్లీబాయితో మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్ నారాయణ

పూడూరు: మండల పరిధిలోని తిర్మలాపూర్, మీర్జాపూర్, మన్నెగూడ పంచాయతీలను శుక్రవారం ట్రైనీ ఐఏఎస్ అధికారి నారాయణ సందర్శించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాలు, బృహత్ నర్సరీలు, డంపింగ్ యార్డులతో పాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లతో మాట్లాడి పనుల వివరాలను తెలుసుకున్నారు. పంచాయతీల నిర్వహణ బాగుందని కితాబిచ్చారు. ఉపాధి హామీ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కమ్లీబాయి, వినోద్‌గౌడ్, ఈజీఎస్ ఏపీఓ రాములు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా మహేశ్వరం



విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

మహేశ్వరం: మహేశ్వరాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కేసీ తండా కొత్వాల్ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన 40 అడుగుల భారీ మహేశ్వరుడి విగ్రహాన్ని శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 8 పురాతన ఆలయాల్లో ఒక్కో ఆలయ అభివృద్ధికి రూ.కోటి చొప్పున మొత్తం రూ.8 కోట్లు మంజూరు చేయించినట్టు తెలిపారు. మహేశ్వరంలో గడికోట, మెట్ల బావి, రాజరాజేశ్వర ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఉదయం ఇంద్రారెడ్డి ట్రస్టు చైర్మన్ కార్తీక్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి దంపతులు భారీ శివుడి విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునితా నాయక్, కేసీ తండా సర్పంచ్ జాటోత్ మోతిలాల్ నాయక్, జిల్లా రైతు కమిటీ సభ్యుడు యాదయ్య ఉన్నారు.

క్లుప్తంగా

ఏడుగురు పేకాటరాయుళ్లపై కేసు

కొడంగల్‌ రూరల్‌ : పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవిగౌడ్‌ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కస్తూర్‌పల్లిలో నమ్మదగిన సమాచారం మేరకు దాడులు చేయగా ఏడుగురు పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 3,500 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతుబీమా ప్రొసీడింగ్స్‌ అందజేత



యాదయ్యగౌడ్‌ కుటుంబ సభ్యులకు బీమా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్‌

ధారూరు: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన ఇద్దరు రైతులకు సంబంధించిన బీమా మంజూరు పత్రాలను ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌ అందజేశారు. శుక్రవారం ఆయన బాధిత రైతు కుటుంబాల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన రైతులు యాదయ్యగౌడ్‌, నర్సింహులు కుటుంబాలకు రైతు బీమా పథకం కింద రూ. 5లక్షల చొప్పున మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ కార్యకర్త శివయ్య బీఆర్‌ఎస్‌లో చేరడంతో ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్‌, సర్పంచ్‌ చంద్రమౌళి, రైతుబంధు మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఏడీఏ సౌభాగ్యలక్ష్మికుమారి



ఫర్టిలైజర్‌ దుకాణంలో స్టాక్‌ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ సౌభాగ్యలక్ష్మి కుమారి

దోమ: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ సౌభాగ్యలక్ష్మి కుమారి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన దోమలోని ఫెర్టిలైజర్స్‌ దుకాణాల్లో ఏఓ ప్రభాకర్‌రావు, ఎస్‌ఐ విశ్వజన్‌తో కలసి తనిఖీలు చేశారు. స్టాక్‌ రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ఫెర్టిలైజర్స్‌ దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశించారు. వానకాలం సీజన్‌ ప్రారంభమైన నేపథ్యంలో విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే ధరల పట్టికను ఏర్పాటు చేసి స్టాక్‌ వివరాలు పొందుపరచాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే డయల్‌ 100కు ఫోన్‌ చేయాలని ఎస్‌ఐ విశ్వజన్‌ రైతులకు సూచించారు.

అప్పుల బాధ భరించలేక.. వ్యక్తి ఆత్మహత్య

శంకర్‌పల్లి: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శంకర్‌పల్లిలోని శ్రీరాంనగర్‌ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏపీలోని ఒంగోలు జిల్లాకు చెందిన కె. శ్రీనివాస్‌(45) ఎనిమిదేళ్లుగా శంకర్‌పల్లిలో మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నారు. అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని సుదర్శన్‌ వద్ద రూ.ఆరు లక్షల వరకు అప్పు తీసుకున్నారు. ఇటీవల కొంత చెల్లించారు. మిగతా డబ్బు కోసం గొడవకు దిగాడని తెలిపారు. దీంతో మనస్తాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య అంజిలమ్మ, కుమారులు సాయి, పండు ఉన్నారు.

ఈగల బెడద నుంచి కాపాడండి



పౌల్ట్రీ ఫాం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు



లిట్టర్‌ను గుంతలో డంప్‌ చేసిన నిర్వాహకుడు

- ఫౌల్ట్రీఫాం ఎదుట ఐనాపూర్‌ వాసుల ఆందోళన

దోమ : గ్రామానికి సమీపంలో ఉన్న పౌల్ట్రీఫాం వల్ల దుర్వాసనతో పాటు ఈగలు, దోమల బెడద ఎక్కువైందని ఐనాపూర్‌ గ్రామస్తులు అన్నారు. శుక్రవారం గ్రామ సర్పంచ్‌ మల్లేశ్‌తో కలిసి పౌల్ట్రీఫాం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌల్ట్రీఫాం వల్లే గ్రామంలో ఈగల బెడద ఎక్కువైందని, పైగా దుర్వాసన భరించలేకపోతున్నామన్నారు. అంతేకాకుండా గ్రామంలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది ఈగల నివారణకు నిర్వాహకులు చర్యలు చేపట్టినప్పటికి, ఈ ఏడాది ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పలు మార్లు నిలదీసిన నిర్వహకుడు పట్టించుకోవడం లేదని అన్నారు. సంబంధిత అధికారులకు ఈ విషయం తెలిపినా పౌల్ట్రీఫాం నిర్వహకులతో కుమ్మక్కై పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం

పౌల్ట్రీఫాంలోని హ్యాచరీస్‌లలో కోళ్ల ఎరువు ఎండిపోయిన తర్వాత దాన్ని ఎత్తిపోయాలి. కానీ నిర్వహకులు ఎరువు తడిగా ఉన్నప్పుడే నీరుపోసి (లిట్టర్‌ను) పెద్ద గుంతలోకి వదిలేస్తున్నారు. దీంతో భరించలేని దుర్వాసన వస్తోందన్నారు. అంతేకాకుండా నీరు నిలువ ఉండటం వల్ల దోమలు సైతం వృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఈ నీరు భూమిలోకి ఇంకడం వల్ల బోర్ల నుంచి కలుషితమైన నీరు వస్తోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పౌల్ట్రీఫాం యజమానిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈగలు, దోమల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

స్పందించడం లేదు



పౌల్ట్రీఫాంతో దుర్వాసన వస్తుందని నిర్వహకుడికి తెలిపినా స్పందించడం లేదు. ఈగలు, దోమలతో గ్రామస్తులు రోగాల బారీన పడుతున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా ఈగలు ఉన్నాయన్నాయి. తినే పదార్థాలపై వాలుతున్నాయన్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి గ్రామస్తులను కాపాడాలి.

– మల్లేశ్‌, సర్పంచ్‌, ఐనాపూర్‌

పసికందుల పాల కోసం గోవు బహూకరణ



ఆవుదూడతో బాల్‌రాజ్‌

పెద్దేముల్‌: ఆ ఇంట పసికందులకు పాలు అందకపోవడంతో స్పందించిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గోవును కొనిచ్చారు. బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకుడు పొట్టుపల్లి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నాగులపల్లికి చెందిన కుర్వ మమత, బాల్‌రాజ్‌ దంపతులు. మమత ఒకే కాన్పులో ముగ్గురు ఆడ పిల్లలకు జన్మ నిచ్చారు. ఆ పసికందులకు పాలు సరిపోడవం లేదని అప్పట్లో ఈ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించారు. ఆయన ఈ విషయాన్ని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి బాల్‌రాజ్‌ కుటుంబానికి ఓ ఆవు (గో మాత)ను కొనుగోలు చేసి ఇప్పించారు. అడిగిన వెంటనే ఆదుకోవడంతో ఆ దంపతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్లూ కోల్ట్స్‌ సిబ్బందికి సీపీ అభినందనలు

- గంట వ్యవధిలోనే చైన్‌ స్నాచర్‌ను పట్టుకున్నందుకు రివార్డు అందజేత



సీఐ లింగయ్యను అభినందిస్తున్న సీపీ డీఎస్‌ చౌహాన్‌, పాల్గొన్న బ్లూ కోల్ట్స్‌ సిబ్బంది

యాచారం: రాచకొండ సీపీ డీఎస్‌ చౌహాన్‌ శుక్రవారం యాచారం బ్లూ కోల్ట్స్‌ సిబ్బందిని అభినందించారు. యాచారంలో రెండు రోజుల కిందట పెరుమాండ్ల ప్రేమల త ఇంట్లో ఉండగా ఓ ఆగంతకుడు కత్తి చూపించి, కళ్లల్లో కారం చల్లి రెండు తులాల పుస్తెల తాడును అపహరించిన విష యం విదితమే. ఈ విషయంపై సమాచా రం తెలుసుకున్న బ్లూ కోల్ట్స్‌ సిబ్బంది కృష్ణ, సంతోష్‌లు వెంటనే స్పందించి గంట వ్యవధిలోనే నిందితుడు జోగు చైతన్యగా గుర్తించి పట్టుకున్నారు.కేసు నమోదు చేసి న సీఐ లింగయ్య జోగు చైతన్యను గురువారం రిమాండ్‌కు పంపించారు. ఇదే విషయమై సమాచారం తెలుసుకున్న రాచకొండ సీపీ శుక్రవారం ఎల్బీనగర్‌ క్యాంపు కార్యాలయంలో బ్లూ కోల్ట్స్‌ కానిస్టేబుల్‌ కృష్ణ, హోంగార్డు సంతోష్‌కుమార్‌లకు రూ.వెయ్యి చొప్పున నగదు రివార్డును అందజేసి అభినందించారు. కేసు నమో దు చేసి తక్షణమే రిమాండ్‌కు పంపించినందుకు సీఐ లింగయ్యను కూడా సీపీ అభినందించారు. నేరాల పట్ల తక్షణమే స్పందిస్తే పోలీసుల పట్ల ప్రజల్లో మరింత గౌరవం పెరుగుతుందని సీపీ అన్నారు.

ఘనంగా ఈదమ్మ జాతర



జల్దిబిందె కార్యక్రమంలో భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దౌల్తాబాద్‌: మండల కేంద్రంలో ఈదమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జల్దిబిందె కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం వేళ మహిళలు బోనాలతో తరలివచ్చారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. జాతరకు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ మహిపాల్‌, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌ శిరీష, ఎంపీటీసీలు, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గన్నీ బ్యాగుల కొరత రానివ్వం

- జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్‌

సాక్షి ఎఫెక్ట్‌..

ధారూరు:మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత రానివ్వబోమని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్‌ అన్నారు. రైతులకు 'గన్నీ' అవస్థలు అనే శీర్షికతో ఈనెల 25న 'సాక్షి'లో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. శుక్రవారం ఆయన ధారూరు, గట్టెపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్‌ భువనేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తరలింపులోనూ సమస్యలు రాకుండా చూస్తామన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్‌ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. తూకాలను తనిఖీ చేశారు. తూకాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆయన నిర్వాహకులను ఆదేశించారు. దుమ్ము, మట్టి, తాలు లేకుండా నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యాన్ని తీసుకరావాలనీ ఆయన రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏ సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. డీఏఓ వెంట ఏఈఓలు సంజూరాథోడ్‌, సుజాత తదితరులు ఉన్నారు.



ధారూరులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్‌

బీజేపీని బలోపేతం చేయడమే ధ్యేయం



మాట్లాడుతున్న మాజీమంత్రి చంద్రశేఖర్‌

కొడంగల్‌ రూరల్‌ : క్షేత్రస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషిచేయాలని పార్టీ నాయకుడు, మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్‌ సూచించారు. శుక్రవారం పట్టణంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. మోదీ అనుసరిస్తున్న విధానాలకు ఆకర్షితులై యువకులు పార్టీలో చేరుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామ గ్రామాన పార్టీని పటిష్టం చేయడమే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ అధికారమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు సదానంద్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రేష్‌, రాష్ట్ర వర్గ సభ్యుడు మురళీకృష్ణగౌడ్‌, మాజీ జెడ్పీ వైస్‌ చైర్మన్‌, భువనగిరి పార్లమెంట్‌ ఇన్‌చార్జి నందకుమార్‌యాదవ్‌, జిల్లా కార్యదర్శులు కె.చంద్రప్ప, బాబయ్యనాయుడు, అసెంబ్లీ కన్వీనర్‌ కె.నర్సింహులు, కొడంగల్‌ మండల అధ్యక్షుడు బందెప్ప, పట్టణ అధ్యక్షుడు ఆర్‌.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో శ్రీచరణ్‌కు 46వ ర్యాంకు



అనంతగిరి: పాలిసెట్‌లో జిల్లాకు చెందిన శ్రీచరణ్‌కు 46వ ర్యాంకు సాధించినట్లు జిల్లా కోఆర్డినేటర్‌ పరమేశ్వర్‌ తెలిపారు. జిల్లా నుంచి 1425 మంది పరీక్షకు హాజరయ్యారని అన్నారు. ఎంబైపీసీ స్ట్రీం (విభాగంలో) జిల్లాకు చెందిన శ్రీ చరణ్‌ 46వ ర్యాంక్‌ సాధించారు. అలూరి శంకరానంద్‌కు 126వ ర్యాంకు, రాపోల్‌ అక్షిత్‌రెడ్డి 150వ ర్యాంకు వచ్చిందన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్‌: విద్యుదాఘాతంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వికారాబాద్‌ జిల్లాకు చెందిన లక్ష్మప్ప(38) పటాన్‌చెరు మండలం నందిగామ పరిధిలో ఉన్న కాలేజీకి సంబంధించిన ఎంట్రెన్స్‌ ఫ్లాగ్స్‌ కడుతున్నాడు. ఈ క్రమంలో విద్యుత్‌ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

రుణాలు సకాలంలో చెల్లించాల్సిందే..

- లేదంటే భూముల వేలం వేస్తాం
- రికవరీ అయితేనే కొత్త రుణాలకు అవకాశం
- వచ్చే నెల నుంచి ఎరువులు అందజేస్తాం
- తట్టెపల్లి పీఏసీఎస్‌ సీఈఓ రాజమౌళి



మాట్లాడుతున్న సహకారం సంఘం సీఈఓ రాజమౌళి

పెద్దేముల్‌: రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించకపోతే భూములను వేలం వేస్తామని తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ రాజమౌళి అన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.దీర్ఘకాలిక రుణాలు 60శాతం రికవరీ అయితేనే కొత్త రుణాలు ఇచ్చేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ప్రస్తుతం 40 శాతం మేర రుణాలు రికవరీ అయ్యాయన్నారు. 2008 నుంచి 2022 సంవత్సరం మధ్య 115 మంది రైతులు దీర్ఘకాలిన రుణాలు తీసుకున్నారన్నారు. అందులో 42 మంది రుణాలు చెల్లించారన్నారు. మిగతా రైతులు రుణాలు చెల్లించలేదన్నారు. వారికి గత నవంబర్‌, డిసెంబర్‌లో నోటీసులు కూడా అందజేశామన్నారు. జైరాంతండాలో ముగ్గురు రైతులు సుమారు రూ.12 లక్షలు, ఆత్కూర్‌తండాలో ముగ్గురు రూ.9లక్షలు, తట్టెపల్లిలో ఐదుగురు –9లక్షలు, ఇందూరులో 12మంది రైతులు రూ.14లక్షలు రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నెల చివరి నాటికి బకాయిలు పూర్తిగా చెల్లించాలన్నారు. నాబార్డు నిధులు రూ.65 లక్షలతో నిర్మించిన ఎరువుల గోదాంను త్వరలో పాలక వర్గం, అధ్యక్షుల అనుమతితో ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు.

జూన్‌ నుంచి వానాకాలం పంట రుణాలు

జూన్‌ మెదటి వారం నుంచి రైతులకు వానాకాలం పంట రుణాలు అందజేస్తామని సీఈఓ తెలియచేశారు. ఎకరాకు రూ.50వేల చొప్పున ప్రతి రైతుకు రూ.2లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. గత ఏడాది రూ.45లక్షల వరకు ఎరువులు అందజేశామని, ఈసారి కోటి రూపాయల వరకు ఎరువులు అందజేస్తామన్నారు.

ఆటస్థలంపై వివాదం.. యువకుడిపై దాడి



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న భీమయ్య

- కాకునూరులో ఘటన
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు



పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వివిధ పార్టీల నాయకులతో బాలమణి

కేశంపేట: ఆట స్థలం వివాదంలో ఓ దళిత యువకుడి పై పలువురు దాడి చేసిన ఘటన కేశంపేట మండల పరిధిలోని కాకునూరులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాకునూరు గ్రామంలో బొడ్రాయి పండుగ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు మహాలింగేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని పొలం వద్ద క్రికెట్‌ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే పొలం యజమానులు క్రికెట్‌ పోటీలు నిర్వహించేందుకు ఒప్పుకోలేదు. దీంతో గ్రామానికి చెందిన దళిత యువకుడు భీమయ్యకు పొలం యజమానులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇది కాస్తా ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ దాడిలో భీమయ్య సొమ్మసిల్లి కిందపడిపోగా వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని కేశంపేటలో ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం భీమయ్యను షాద్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ వద్ద మాట్లాడుదామని గ్రామానికి చెందిన పలువురు తన భర్తను భీమయ్యను ఇంటి నుంచి బలవంతంగా లాక్కెళ్లి దాడి చేశారని భార్య బాలమణి ఆరోపిస్తున్నారు. తన భర్తను హత్య చేసేందుకు గ్రామానికి చెందిన పలువురు కుట్ర పన్నారని, న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు గ్రా మానికి చెందిన జంగం మహాలింగం, బద్రీతో పాటుగా మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ ధనుంజయ్‌ తెలిపారు.

బాధితుడిని పరామర్శించిన నేతలు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భీమయ్యను కాంగ్రెస్‌, బీఎస్పీ, డీఎస్పీ, ఎంఎస్పీ నాయకులు శుక్రవారం ఉదయం పరామర్శించారు. భీమయ్య పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్‌ చేశారు. పరామర్శించిన వారిలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలుగడ్డ ప్రవీణ్‌యాదవ్‌, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు లింగం, ఎమ్మార్పీస్‌ జిల్లా కోకన్వీనర్‌ గ్యార సురేష్‌, దొడ్డి శ్రీనివాస్‌, ప్రశాంత్‌, కుమార్‌, ఇంద్రసేన, హరికుమార్‌, జగన్‌, శ్రీనివాస్‌, రాకేష్‌, రాజు, మల్లేష్‌, శివకుమార్‌, చెన్నయ్య, చిన్నోళ్ల అనంతయ్య, పెంటనోళ్ల నర్సింహ్మా, సురేష్‌, శ్రావణ్‌కుమార్‌లు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- అత్తింటివారే హత్య చేశారంటూ మృతురాలి తండ్రి ఆరోపణ
- పోలీసులకు ఫిర్యాదు

మర్పల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌ పట్టణానికి చెందిన ఇస్మాల్‌బీ, మహ్మద్‌ షరీఫ్‌ ఖాన్‌ దంపతుల కూతురు నాహీదాబీని మర్పల్లికి చెందిన మహ్మద్‌ అక్రమ్‌కు ఇచ్చి 2019లో వివాహం చేశారు. కొంతకాలం బాగానే ఉన్న వీరి కుటుంబంలో అదనపు కట్నం కోసం తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య గొడవ పడి జహీరాబాద్‌లోని తన పుట్టింటికి వెళ్లింది. పెద్దల సమక్షంలో రాజీకుదిర్చి భర్త అక్రమ్‌ వద్దకు పంపారు. మళ్లీ ఘర్షణ జరగడంతో ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. విషయం తెలియంతో పోలీసులు ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి మహ్మద్‌ షరీఫ్‌ ఖాన్‌ మాట్లాడుతూ అదనపు కట్నం కోసం కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయన్నారు. అత్తింటి వారే నా కూతురును హత్య చేశారంటూ ఆరోపించారు. అనుమానం రాకుండా ఆత్మహత్యగా చిత్రీకరించారని అన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మర్పల్లి ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతురాలి బంధువులు (ఇన్‌సెట్‌లో) నాహీదాబీ మృతదేహం